కథానిక

# రాజులెందరు మారినా-

యర్రా మురళీ కృష్ణమోహన్

‘అమ్మయ్య! స్వరాజ్యం వచ్చేసింది, ఇక మన కష్టాలు గట్టెక్కాయన్నమాటే, మీరయినా సుఖపడండి, అంతా దేవుడిదయ” అంటూ కన్నుమూశాడు రంగడి తండ్రి—ఆరువందల ఋణం, ఎకరం పొలం, ‘మునసబుధర్మమా’ అని ఆయన స్థలంలో వేసుకొన్న గుడిశె రంగడికివదిలి సంవత్సరం వెళ్లింది.

“ఋణం తీరాక కాని పెళ్లిచేసుకోకూడదు” అనుకొన్న రంగడు అభిప్రాయం మార్చుకున్నాడు తల్లి బలవంతంమీద. ఋణంవెయ్యికి పెరిగింది. రంగడికి పద్ధెనిమిదోఏట పెళ్లయింది.

సీతను ఎంచుకున్నారు వాళ్లవాళ్లు. అక్షరజ్ఞానంలేని రంగడు దాంపత్యంలో అందచందాలతో అవసరం వుంటుందో వుండదో తేల్చుకోలేదు.

ప్రేమంటే ఏమిటో రంగడికి తెలియదు. కాని భార్యను ప్రేమించకపోలేదు. అదేప్రేమని, ఎందరు కవులు వర్ణించినా దాన్నేనని అతనికి తెలియదు.

అతను డబ్బున్నవాడు కాదు తిని కూర్చుని ఆలోచించటానికి. దిట్టంగా డబ్బుండీ, పనీపాటా లేనివాళ్లకు ప్రేమ జీవితావసరపు వస్తువు. రెక్కాడితే డొక్కాడేవాళ్లకు ప్రేమజీవితావసరపు వస్తువుకాదు. అథవాఅయినా అంతంతమాత్రమే! సీత కాపరానికి వచ్చేసరికి రంగడికి ఇరవైయేళ్లు.

వున్నయకరానికి సాయం మరో రెండెకరాలు కౌలుకు చేయటం ప్రారంభించాడు రంగడు. మధుర స్వప్నాలుకంటూ, భవిష్యత్తుకి బంగారు రంగరించి పూతపూశాడు. తనకి పిల్లలు పుడతారని ‘ఎంచక్కా’ వాళ్లకి చదువుచెప్పించి పెద్దవాళ్లను చెయ్యాలని, వాళ్లు తనలా కష్టపడి పొట్టపోషించుకో నక్కరలేకుండా ఉద్యోగాలుచేసి సంపాదించుకోవాలని కలలుకనేవాడు రంగడు.

మూడేళ్లు గడిచాయి.

ఇద్దరుపిల్లలు కలిగారు రంగడికి అత్తనుకూడా రంగడే పోషించాల్సి వచ్చింది. అక్కడికి రంగడి కుటుంబసంఖ్య ఆరో అంకెమీదికి దేకింది. ఎంత కొట్టుకున్నా సంసారం వెళ్లటమే గగనమయిపోయేది; ఇక ఋణం ఎలా తీర్చగలడు?

కానీఅయినా వసూలు పెట్టకపోతే ఋణం ఏమవుతుంది? రెట్టింపయి కూర్చుంది. నాలుగేళ్లగా కానీ అడగని శేషయ్య—కనిపించినప్పుడల్లా కదలేయటం ప్రారంభించాడు.

ఆఖరికి ఒకరోజున నిలబెట్టి అడిగాడు శేషయ్య. ఆరునెలలు గడువిచ్చానన్నాడు. ఆతరువాత కోర్టుకి వెళ్లాల్సివస్తుందని బెదిరించాడు.

రంగడు ఆలోచించాడు. ఆరునెలల తర్వాత మాత్రం అంతడబ్బు ఎలావస్తుంది? ఆరునెలలుకాదు, ఆరుదశాబ్దాలయినా అంతడబ్బు కళ్లచూడటం అసంభవమనుకున్నాడు. అయితే మరి మార్గం? ఒకటే ఒకదారి కనిపించింది అతనికి—పొలంకాస్తా అమ్మేసి ఋణవిముక్తుడు కావటం.

తాతముత్తాతలనుంచీ వస్తున్న ఆ పొలం అమ్మటానికి రంగడి తల్లి ఇష్టపడలేదు. కాని మరో మార్గం దొరకలేదామెకు.

రంగడు ఎకరంపొలం బేరంపెట్టాడు.

తనఖాపొలం ఎవరూ కొనటానికి ముందుకు రాలేదు.

ఆఖరికి శేషయ్యానే కొనమన్నాడు. “అబ్బె! నాకెందుకురా నీపొలం” అంటూనే “అప్పుకి సరిపెట్టుకో” అన్నాడు శేషయ్య. రంగడితల్లి మొరపెట్టుకొంటే ఓ వందరూపాయిలిచ్చి ఎకరం వ్రాయించుకున్నాడు శేషయ్య.

స్వాంతం హరించిపోయాక మంచంపట్టాడు రంగడు. కాని ఏంచేయగలడు? గుండె రాయిచేసుకొని కౌలుకు పొలంచేస్తూ కాపుం గలడుతున్నాడు.

వున్నట్టుండి వుప్పెనలా బయలుదేరిందో 'పుకారు' కౌలుదారీచట్టం వస్తోందని ఎవరు చేస్తున్న పొలాలు వాళ్లకయిపోతాయని, గోరంతలు కొండంతలుగా ప్రచారం అయిపోయాయి.

ఈ గాలికబుర్లుకి జడవలేదు చాలామంది. కానీ, అన్యాయంగా ఆర్జించిన ఆస్థేమో కనకయ్య మాత్రం జడుసుకున్నాడు ఎక్కడకౌలుదార్లు ఎగ తీసుకు పోతారో అని. పండించలేక పోయినా భూమి తన కిందవుంటేచాలనుకున్నాడు.

ఈ హడావిడిలో రంగడు కౌలుకు పొలం చేసుకొనే ఆస్కారం కాస్తాపోయింది. కనకయ్య రంగడ్ని ఆఏటితో తప్పుకోమన్నాడు.

నారోసినవాడు నీరోయకపోతాడా? రంగడు శేషయ్య వగ్గర పాలేరుగా చేరాడు.

అంతర్జాతీయ సూత్ర ప్రకారం దరిద్రుడికీ సంతానానికీ దూరంవుండదు. సీత మళ్లా నీళ్లు పోసుకుంది. ముసలితల్లి మంచానపడింది...సరైన మందు మాకులు లేక ముసలిది రోగిష్టి మంచం లోనే వుంది. తినడానికి సరిపడ్డ తిండిలేక ఏడుస్తుంటే మందులేమిటి?...ధర్మాసు పత్రిలో రంగు నీళ్లుకు రోగాలు పోతాయా? పోవు అని నిరూపించింది రంగడితల్లి.

తల్లి మరణానికి రంగడు విచారించలేదు. తిండి లేక మాడటంకంటే చావటం మంచిదే అయిందనుకున్నాడు.

* * *

రంగడి పాలిట శనిదేవతలా పంచాయతీబోర్డు ఎన్నికలు వచ్చాయి. శేషయ్య ప్రసిడెంట్‌గిరీకి పోటీచేసాడు. అతనికి పోటీగా మరో ఎల్లయ్య నిలబడ్డాడు. ఇద్దరూ బాగావున్నవాళ్లే. అందు చేతనే ఎవరు నెగ్గేదీ ఎవరూ తేల్చిచెప్పలేక పోయారు. ఇరుపక్షాల ప్రచారంమాత్ర అద్వితీయంగా సాగుతోంది.

తెల్లవారిచే పోలింగ్. మరోసారి చెబితే ఎందుకయినా మంచిదనుకున్నాడు శేషయ్య ఓటు తనకే వెయ్యమని మరీ మరీ చెప్పి పంపాడు రంగడినా రాత్రి శేషయ్య ఓట్లు కొన్నట్టు విన్నాడు రంగడు. తనకూ ఏమయినా ఐదో, పదో ఇస్తాగేమో అని ఆశపడ్డాడు. శేషయ్య అలాంటి దేంచెయ్యలేదు. "నాపాలేరు నాకు వెయ్యాలిగాని?" అన్నధీమాతో పది రూపాయలు కూడ బెట్టాడు.

రంగడు గుడిశెకి వెళ్లేటప్పటికి ఎల్లయ్య పార్టీ వాళ్లు వచ్చి కూర్చున్నారు. చేతిలో పది రూపాయల నోటుపెట్టి ఎల్లయ్యకు వోటెయ్యమన్నారు. రంగడు సందిగ్ధంగా వూరుకున్నాడు. రంగడి మౌనంచూసి సీతపదీపుచ్చుకొని వోటేయిస్తానని మాటిచ్చింది.

"ఎందుకుచ్చుకొన్నావే?" అరిచాడు రంగడు.

"బాగుంది వరస సంపాదించేది లేదుకాని—" సాగదీసింది.

"ఆరికాడ పాలేరుతనం సేత్తా ఆరికెయ్యక మరి ఎవరికేత్తాం?"

"చేసేవులే మా లావు పాలేరుతనం——అయినా మొగానికి సిగ్గుండక్కర్లే, అయిన ఎకరం అన్నాయింగా ఏసుకున్నోడికి ఎత్తానంటావేం వోటు ఇంకా ఇలా బిదోళ్ల పొలం వేసుకోటానికికా"

తాతముత్తాతల నుంచీ వస్తున్న పొలం కాజేసినందుకు రంగడు కసితీర్చు కోవటాని కదేమంచి సమయం అనుకున్నాడు. అంతకంటె ఏంచేయగలడు కనుక? అయినా, ఎవరికేస్తే మంచిదో, అసలు వోటు విలువ ఏమిటో అతనికి తెలుసు కనుకనా?

మర్నాడు ఎన్నికలు జరిగాయి... శేషయ్య ఓడిపోయాడు. అయిదు వోట్లు మెజారిటీతో ఎల్లయ్య ప్రశిడెంట్ అయ్యాడు.

చిందులు తొక్కాడు శేషయ్య నిప్పులు తొక్కినని కోతిలా. ఎల్లయ్య పార్టీవాళ్లు రంగడి గుడిశెకు వెళ్లటం చూసిన ఎదురింటి ఏసోబు శేషయ్యతో ఆ విషయంకాస్తా విన్నవించుకొని, వూడ్పుల రోజుల్లో సీత చెంగులాగి చెంపపగిలేలాతిన్న కసి తీర్చుకున్నాడు.

శేషయ్య రంగడిని పిలిపించాడు. రంగడు నిజం చెప్పలేదు. అయిదు వేలు ఖర్చుపెట్టి వోడిన శేషయ్య తన పాలేరు తనకు ఓటువెయ్యలేదనేసరి మండి పడ్డాడు. ఏసోబు మాటలు వేదాక్షరాల్లా నమ్మడు. రంగడు పనిపోయింది. రంగడు జరిగిందంతా ఎల్లయ్యతో మొరపెట్టుకున్నాడు.

ఎల్లయ్య సానుభూతి చూపలేదు "అలాగా" అని వూరుకున్నాడు.

"నావోటు మీకే ఏశానండి, అందుకే నా పని పోయింది, మీదగ్గర పెట్టుకోండి" అన్నాడు రంగడు.

"ఇప్పుడే ఖాళీలు లేవురా, అయినా వూరికే ఏసేవేంరా, పదిపుచ్చుకొన్నావేమో పడేశావు, సరిపోయింది వెళ్లు" అన్నాడు ఎల్లయ్య.

పళ్లుకొరుకుతూ, సీతను తిట్టుకుంటూ వెళ్లిపోయాడు రంగడు.

"చేయాల వోటెయ్యమన్నావు, ఈ యాల పని పోయింది ఇక ఏడు"

"ఎల్లయ్యతో చెప్పలేక పోయావా ఆయనిచ్చేవోడుపని"

"ఆఁ! ఇత్తాడు— పదిచ్చేనుగా సరిపోయింది ఎల్లమన్నాడు"

"ఆరి ఈడిజమ్మతియ్య ఎంతపని చేసాడు" అంది సీత.

* * *

"బాబూ సైకిల్ రిక్షా"

. . . . . . . . . . . . . . . .

"సైకిల్ రిక్షాండి"

"నువ్వేం తొక్కగలవురాపో"

"ఆడిగాడీ ఎక్కకండి బాబు నాగనేక ఏ వంతెన మీదో వొగ్గెత్తాడు. మడిసిని చూశారా ఎలాగుండాడో" అన్నారు సోదరమానవుడ్ని తోటి రిక్షావాళ్లు.

రోజుల్లాతిరిగినా రిక్షా అద్దెకు దాటిరాలేదు. రంగడికి రిక్షాతొక్కటంకొత్త. ఎంత అడిగినా అందులో సఖం ఇస్తామనేవారు. ఇచ్చినమట్టుకు పుచ్చుకొంటూ రోజంతా తిరిగితే వచ్చిన రూపాయన్నర రిక్షాయజమాని స్వాహాచేశాడు. రంగడురిక్తహస్తాలతో బయలు దేరాడు.

రంగడిల్లి చేరేటప్పటికి సీత ప్రసవవేదన జడుతోంది. ఆకాశం వేపుచూసాడు రంగడు తన నిస్సహాయస్థితిని వెల్లడిస్తూ. కానీ భగవంతుడు రంగడ్ని చూసినట్లులేదు.

అత్త డాక్టర్‌ని తీసుకురమ్మంది. రంగడు నాటు వైద్యుడి దగ్గరకు పరిగెత్తాడు.

"కాన్పు సులువుగా అయ్యేందుకు మాత్రలిస్తాను సొమ్ము తెచ్చినావా" అన్నాడు వైద్యుడు.

"రెండు రోజుల్లో ఇచ్చుకుంటాను బాబు" రంగడు ప్రాధేయపడ్డాడు.

వైద్యుడికి రోజులమహిమ తెలుసు. డబ్బు ముందు కక్కమన్నాడు. రంగడు కాళ్లావేళ్లా పడ్డాడు—కానీ లాభం శూన్యం అయింది.

రంగడ్నిచూసి పెదిమవిరించి అత్త. మందు లేకపోతే లాభంలేదంది. సాయమొచ్చిన ఎరుకలది అత్తమాటలకు వంతపాడింది.

భార్యవేదన, అత్తగోల చూసివణికి పోయాడు రంగడు. రెండురోజులనుంచి తిండిలేక పోయినా లేనిసత్తువ పుంజుకొని పరిగెత్తాడు పక్కనున్న పట్టణం.

పిచ్చివాడు! తాను వెళ్లగానే మందు అందిస్తారని, డాక్టరమ్మ తనకూడా వస్తుందని అనుకున్నాడు రంగడు.

ఈ స్వతంత్ర భారతదేశంలో అంత దయార్ద్రహృదయులు లేరని; కష్టపడి చదువుకొని డాక్టరువృత్తి చేపట్టటం జీవితాన్ని దర్జా వీధుల్లో, మోటారులమీద వెళ్లదీయటానికికాని బీదలకు ప్రాణదానం చేయటానికి కాదని రంగడికి తెలియదు.

రంగడు వణుకుతూనే చెప్పుకున్నాడు తనగోడు.

"మీరు రాకపోతే మాఇంటిది అన్యాయంగా సచ్చిపోతది" అని ప్రాధేయపడ్డాడు.

అంతావిని వీలులేదంది డాక్టర్.

రంగడు కాళ్లావేళ్లా పడ్డాడు.

ఇంతలో ఎవరోవచ్చి "నాయుడిగారిభార్య నొప్పులు పడుతోంది" అంటూ డాక్టర్‌ని తీసుకువెళ్లారు.

రంగడ్ని చూసి డాక్టర్ తోటమాలి జాలిపడ్డాడు. "డబ్బునోళ్ళయిరా రోజులు! పాతిక రూకలు ముందు కళ్ళబడితేకాని ఈయమ్మ కాలు కదపదు" అన్నాడు మాలి.

రూపాయలు పేరువినగానే రంగడి ఆశాజ్యోతి ఆరిపోయింది.

పాతికరూపాయలు!

ఒకటా... రెండా... పాతిక!!

ఎలావస్తాయి?

ఎవరిస్తారు?

—తనలాంటి నిర్భాగ్యుడికి!

ఏదో జ్ఞాపకంవచ్చింది రంగడికి.' 'ఇది దర్మాసుపత్రి గందాడబ్బెందుకివ్వాలి బాబు?" అన్నాడు

"ఓరి పిచ్చి మాలోకమా! ఇంకా సత్తెకాలంలోనే వున్నా! ఇది పేరుకురా దర్మాసుపత్రి"

ఏంచెయ్యాలో తోచలేదు రంగడికి.

అలవాటు ప్రకారం కాళ్లు కొంపకి చేర్చాయి. రంగడు వెళ్ళేసరికి అక్కడ రంగం ముగిసింది.

రంగడికి ఆకాశం నెత్తినవిరిగి పడలేదు. "అదృష్టవంతురాలు నరకంపడలి వెళ్ళిపోయింది." అనుకొన్నాడు.

పిల్లల్ని చూసుకొని బావురు మన్నాడు.

"ఏడిస్తే ఏంలాంభరా, ఎల్లి ఏ పెద్దకాపు కాళ్ళోపట్టుకో ముందు జరగాల్సింది శానావుంది" అంది సాయిమొచ్చిన ముసలమ్మ.

రంగడు బయలుదేరాడు కళ్లుతుడుచుకుంటూ. బయలుదేరక ఏంచేస్తాడు ముందు జరగాల్సింది శానావుంది మరి!

* * *

"ఏరా! ఇలా ఏడిశావేం?" గర్జించాడు ప్రశిడెంట్ ఎల్లయ్య.

రంగడు అంతా చెప్పుకొని పది రూపాయలు అప్పిమ్మని ప్రాధేయపడ్డాడు.

"కొంపన్నా లేదు గందా, ఆ మునసబు దర్మమా అని ఆయన జాగాలో ఏసుకొన్నావు గుడిశె, అప్పుతిరిగొచ్చే ఇదానం?" అన్నాడు ఎల్లయ్య.

తనకంటె తక్కువస్థితిలోవున్న సొంతతమ్ముడు కెందామీదావున్న పరిస్థితిలో తమ్ముడు కొడుకులు అప్పుకొస్తే తనఖా రాయించుకొంటె నలుగురూ ఊస్తారని మొండిచెయ్యి చూపించిన ఎల్లయ్య రంగడి కిస్తాడా?

"మీకాడ పాలేరు తనంచేసి తీర్చునంటా" అని బతిమాలాడు.

ఎల్లయ్య లేదన్నాడు.

రంగడు రాయిలా అయిపోయాడు. అతని హృదయం నిరాశతో నిండిపోయింది. అవమానంతో వుడికిపోయింది. బండయమొండి తేలి పోయింది.

రంగడు లేచాడు.

"ఏమిటి నీ కర్తవ్యం!" అంది అంతరాత్మ.

"ఏంచెయ్యను?" అన్నాడు రంగడు.

ఎన్నాళ్లు బ్రతికినా ఇంతే నీ బ్రతుకు. ఘనకార్యాలు చెయ్యలేవు—నీచాని కొడిగట్టలేవు—ఇప్పట్లో మరో దారిలేదు బ్రతకటానికి" విజృంభించింది అంతరాత్మ. ఆలోచిస్తు నిలబడ్డా రంగడు.

"మొన్న చేబదులు బాపతు" అంటూ పెద్దకాపుమల్లయ్య నోట్లుకట్ట ఇచ్చివెళ్ళాడు.

రూపాయలు కళ్ళబడేసరికి వళ్ళుమర్చిపోయాడు రంగడు. రక్తంవురకలు తీసింది. ఆవేశం అంచులు దాటింటి. బుద్ధిపనిచెయ్యటం మానేసింది.

"లేదేం?" అంటూ ఎల్లయ్య మీదకు దూకాడు రంగడు.

ఎల్లయ్య లబోదిబో మనేసరి నలుగురు పోగయ్యారు, కాసిన్ని చన్నీళ్లుపట్టగా ఎల్లయ్య లేచాడు.

రెక్కలువిరగ బొడిచేదాకా తానేంచేసింది తెలియలేదు రంగడికి.

ఆ తరువాత కార్యక్రమం క్రమం తప్పకుండా జరిగింది.

పోలీసులు... కేసు... కోర్టు... శిక్ష!

సంవత్సరం కఠినశిక్ష విధించాడు రంగడికి న్యాయాధిపతి. న్యాయాధిపతి మాత్ర మేంచేయగలడు? చట్టానికి బద్ధుడు. చట్టానికి పరిస్థితులతో పనిలేదు.

* * *

"దేశానికి వెన్నెముక, భూమాత ప్రియతమ పుత్రుడు జైలుకువచ్చాడు. దేశం బాగానేవుంది. సోఫాల్లో, ఫానులకింద బొజ్జలునిండిన అయ్యలు దొర్లుతూనే వున్నారు తిన్నది హరాయించుకోలేక గుజ్జుప్పుందాల్లో, సానికొంపల్లో తగలేస్తూనే వున్నారు. అయినా వాళ్ళకు లోటులేదు. లోటురాదు. వాళ్ళకీ పెళ్ళాం పిల్లలు వున్నారు. కానీ వాళ్ళకేం? కష్టపడాలా? ఏ రోజుతిండి ఆరోజు వెదుక్కోవాలా?" అంటూ జైలువూసలు గుంజాడొకఖైదీ రంగడి నేరంవిని.

"అది వాళ్ళతలరాత" అన్నాడు మరొఖైదీ.

"రాజులెందరు మారినా——

మన రోజులేమో మారవ్వా"

అంటూ నెమ్మదిగా పాడుకుంటున్నాడు అక్కడ కాపలావున్న పోలీసు వెంకటస్వామి. ★